క్లుప్తంగా

20న 'జగనన్నకు చెబుదాం'

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 'జగనన్నకు చెబుదాం(స్పందన)' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటన తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లొచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయంలో ఇంటర్న్‌షిప్



గ్రామ సచివాలయంలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు కొద్ది రోజులుగా ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. సోమగండి గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు ఎటువంటి సేవలు అందుతున్నాయి, ఏఏ పథకాలు లబ్ధిదారులకు అందజేస్తున్నారు, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. చదువుకుంటూనే ప్రజా సేవలో భాగస్వాములవుతున్నారు.

విస్తృతంగా ఇంటింటి సర్వే



'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే చేస్తున్న వైద్య బృందం

పాలకొండ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా ఇంటింట సర్వే చేపట్టాలని వైద్యాధికారి తేజరత్న అన్నారు. పట్టణ పరిధిలో వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను శనివారం ఆమె పర్యవేక్షించారు. 15 రోజుల్లో ప్రతీ ఇంటిని సందర్శించి నివాసితుల ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి త్వరలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక వైద్యశిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలో ప్రతిభ



ప్రశంసా పత్రంతో విద్యార్థినులు

జియ్యమ్మవలస: పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, ఎయిడ్స్ కంట్రోల్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలో బీజేపురం, జియ్యమ్మవలస ఉన్నత పాఠశాలల విద్యార్థుల బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎంపీ అభినయ(9వ తరగతి), సృజన (8వ తరగతి), ఎల్.లిఖిత్ ప్రేమ్‌చంద్(9వ తరగతి), యు.సాత్విక్(8వ తరగతి) ప్రతిభ కనబరిచారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమాజ్యోతి చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు రూ.4 వేల నగదు ప్రోత్సాహం అందుకున్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం..



పాలకొండ: మట్టి వినాయక ప్రతిమలను తయారు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాలకొండ: వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని తలవరం హైస్కూల్ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణంలో శనివారం మట్టి గణపతి విగ్రహాల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు.హెచ్‌ఎం ఉప్పాడ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: గణపతి పూజలో సాంప్రదాయాన్ని అనుసరించాలని పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులచే తయారు చేయించిన మట్టి వినాయక విగ్రహాలను తంపటాపల్లి, ఎం.సింగుపురం, అంపిలి, అట్టలి తదితర పాఠశాలల్లో మట్టి గణపతి ప్రతిమలు అందించారు.

వంశధారలో వరద తగ్గుముఖం



వంశధార నదిలో వరద ప్రవాహం

భామిని: వంశధార నదిలో వరద ఉద్ధృతి తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నదిలో వరద ప్రవాహం తగ్గింది. దీంతో నదికి అవతలవైపు ఉన్న గ్రామాలకు పడవ ప్రయాణాలు తిరిగి ప్రారంభమయ్యాయి. రెండు రోజుల క్రితం నదిలో సుమారు 60 వేల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం ఉండేది.

గడపగడపలో సంక్షేమం..

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- వండవలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



వండవలో మహిళకు సంక్షేమ లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన గురుతర బాధ్యత తమపై ఉందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండవ గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతీ గడపకు వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగించాల్సిన అవసరం ఉందని, అది ఒక్క వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు మీ అందరి ఆశీస్సులు కావాలన్నారు. నవరత్న పథకాలతో ప్రతీ నిరుపేద కుటుంబానికి లబ్ధి చేకూరిందని, వారి జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలతో రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా అమలు చేశామన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకుల మాటలను ప్రజలు విశ్వశించడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ జంపు కన్నతల్లి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ మిడితాన కళ్యాణి, వైస్ ఎంపీపీలు పత్రి విజయకుమారి, విశ్వాసరాయి భార్గవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, దమలపాటి ఉమా, నీలం సత్యంనాయుడు, కందల వెంకటనాయుడు, గొర్లె బలరాం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల



మల్లేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: ప్రతీ కార్యకర్తకు కష్టకాలంలో అండగా ఉంటామని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు భరోసా ఇచ్చారు. ఈ మేరకు మండలంలోని పి.ఆమిటి గ్రామ పంచాయతీ ఎగువమండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సచివాలయం కన్వీనర్ మల్లేష్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవలే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పరీక్షిత్‌రాజు శనివారం మల్లేష్ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మల్లేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, సర్పంచ్ తాడంగి దమయంతి, నిమ్మక హైమావతి, బిడ్డిక సూర్యం, కె.వాసుదేవరావు, వైస్ సర్పంచ్ తాడంగి ధనుంజయరావు, పార్టీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ తోయక గోపాల్ తదితరులున్నారు. అనంతరం ఆయన గ్రామస్తుల వినతి మేరకు పి.ఆమిటి రోడ్డు నుంచి ఎగువ మండ గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో ప్రవహిస్తున్న గెడ్డను పరిశీలించారు. గెడ్డ వద్ద కల్వర్టు నిర్మించేలా ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామయ్య

పాలకొండ: వసతి గృహాలు, హోటళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామయ్య అన్నారు. పట్టణంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలు, హోటళ్లలో శనివారం తనిఖీలు చేపట్టారు. ఫుడ్ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్తీ లేని, నాణ్యమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో కొంతమంది వ్యాపారులను భయపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అటువంటి వారికి వ్యాపారులు భయపడొద్దని, వారి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఉల్లిభద్ర విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో యోగా టీచర్

గరుగుబిల్లి: బుద్ధయోగ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే యోగా పోటీలకు మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కురుపాంలో శనివారం జిల్లా స్థాయిలో యోగాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఉల్లిభద్ర హైస్కూల్ విద్యార్థులు అండర్-14 విభాగంలో ఇద్దరు బాలురు, ఒక బాలిక ఎంపికయ్యారు. అలాగే అండర్-17 విభాగంలో ఇద్దరు బాలురు, ఒక బాలిక ఎంపికైనట్లు యోగా టీచర్ గడిదేసి గణేష్ తెలిపారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి, గ్రామస్తులు అభినందించారు.

ఎర్రజెండాతోనే హక్కుల సాధన

కురుపాం: రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను గిరిజనులు పొందాలంటే ఎర్రజెండాతోనే సాధ్యమని కోరన్న, మంగన్న స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని గిరిజనులందరూ ఏకతాటిపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాడడానికి సిద్ధంగా ఉండాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, కె.సుబ్బమ్మ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం నాయకులు ఎం.రమణ అధ్యక్షతన నియోజవర్గ స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, కె.సుబ్బమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ధరలను విపరీతంగా పెంచి సామాన్యునకు అందనంత దూరంలో ఉన్నాయని, సంవత్సరానికి రూ.2 కోట్లు ఇస్తామన్న మోదీ తొమ్మిదేళ్లలో ఉన్న ఉద్యోగాలు పీకేశారు తప్ప, కొత్త ఉద్యోగాలు ఇచ్చే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్. కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పాల్గొన్నారు.

కషాయాలతో తెగుళ్ల నివారణ



కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ విధానాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు పంటలకు కావాల్సిన ఎరువులను స్వయంగా వారే తయారు చేసుకోవాలని ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు అన్నారు. మండలంలోని జె.కె.పాడు గ్రామానికి చెందిన రైతులు సాగు చేస్తున్న పంటలను శనివారం పరిశీలించారు. నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం తదితర కషాయాలతో పంటలను ఆశించే తెగుళ్లను నివారించవచ్చన్నారు. కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రకృతిలో లభించే వస్తువులతో వీటిని సులభంగా తయారు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు బిడ్డిక పద్మ, అగ్గన్న, సరోజిని, నవ్య, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్‌కు చెందిన పి.దివ్య, ఎ.సంధ్య, బి.ప్రణీత రాష్ట్రస్థాయి అథ్లటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 9న విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సౌత్ జోన్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరంతా ఈనెల 21 నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్ శనివారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు, పీడీ, పీఈటీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం




కొమరాడ: మాట్లాడుతున్న సీడీపీఓ సుగుణకుమారి

పాలకొండ రూరల్: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవటం వలన ఆరోగ్య లబ్ధి చేకూరుతుందని సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. పాలకొండ మండలం వాటపాగు, తంపటాపల్లి, భాసూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సదరు కేంద్రాల ద్వారా తల్లీబిడ్డ, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. పౌష్టికాహార ఆవశ్యకతను అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు వివరించారు.

కొమరాడ: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని కొమరాడ అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి సుగుణకుమరి అన్నారు. మండల కేంద్రం కొమరాడలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అవసరమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను ఉచితంగా అందిస్తోందన్నారు. వాటిని లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

సేంద్రియ సాగు విధానం లాభదాయకం



సేంద్రియ వ్యవసాయ విధానంపై పోస్టర్లు ప్రదర్శిస్తున్న గిరిజన రైతులు

భామిని: మండలం సన్నాయిగూడలో ప్రకృతి వ్యవసాయంపై వాస్సన్, వెలుగు సంస్థ ప్రతినిధులు శనివారం గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో సాగు రైతుకు లాభదాయకమని వాస్సన్ ప్రతినిధి అబ్బాయి శెట్టి వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే కషాయాల తయారీని వివరించే కరపత్రాలు పంచిపెట్టారు. వెలుగు, వాస్సన్ సంస్థల ప్రతినిధులు బి.జగ్గయ్య, పి.నాగేశ్వరరావు, కె.సుగ్రీవులు, బి.లోకనాథం పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పింఛన్ల పెంపు ఫైల్‌పైనే తొలి సంతకం చేశారని ఎమ్మెల్యే పాములు పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంలో కొత్తగా మంజూరైన పింఛన్లను శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం అందించలేనన్ని సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిందన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇలాంటి నాయకుడు సీఎంగా ఉంటే ప్రతీ ఇల్లు సుభిక్షంగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు పొందాలంటే జన్మభూమి కమిటీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, జగనన్న అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉరిటి రామరావు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎంపీడీఓ జి.పైడితల్లి, తహసీల్దార్ జీవీ జనార్దన్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవాళికి రక్షణ కవచం ఓజోన్



పాలకొండ రూరల్: తపంటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన



వీరఘట్టం: కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓ3 ఆకారంలో విద్యార్థుల మానవహారం



వీరఘట్టం: ఓజోన్ ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ చేస్తున్న తలవరం హైస్కూల్ విద్యార్థులు

పాలకొండ రూరల్: మానవాళికి రక్షణ కవచంగా ఓజోన్‌పొర కాపాడుతుందని మండలంలోని తంపటాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పఠశాల హెచ్‌ఎం పద్మజ అన్నారు. పాఠశాలలో శనివారం ఓజోన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓజోన్ పొర ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కాలుష్యాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించడం, అడవులను సంరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఓజోన్ పొరను కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గొడుగులు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరి శ్రీనివాసరావు, జి.మురళి తదితరులున్నారు.

వీరఘట్టం: పర్యావరణ పరిరక్షణ కోసం ఓజోన్‌పొరను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఉప్పాడ అప్పారావు, కంబరవలస సైన్సు ఉపాధ్యాయుడు అన్ను వెంకటరావు అన్నారు. శనివారం ఓజోన్ దినోత్సవం సందర్భంగా పాఠశాలల ఆవరణలో ఓజోన్ ఫార్ములా ఓ3 ఆకారంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థు లు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పొర ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. సూర్యు ని నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాలను ఓజోన్‌పొర శోషించుకుని భూమి మీద నివశించే జీవరాశులకు రక్షణగా నిలుస్తోందన్నారు.

ఉత్సవాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి



వినాయక మండపం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వీరఘట్టం: వినాయక ఉత్సవాలను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని ఎస్సై ఎం.వి.రమణ కోరారు. శనివారం పలువురు ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ మహోత్సవాలు జరుపుకోవాలని సూచించారు. అలాగే పలు వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాలను పరిశీలించి, కమిటీ సభ్యులు పేర్లు, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు, రాత్రి పూట మండపంలో ఎవరు ఉంటారు, తదితర వివరాలపై ఆరాతీశారు. సచివాలయంలో లేదా మీ-సేవా కేంద్రాల్లో ఉత్సవాల అనుమతి కోసం దర ఖాస్తు చేసి చలానాతో పాటు ఉత్సవ కమిటీ వివరాలను సబ్ డివిజనల్ వారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

భామిని: మండలంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు విధిగా అనుమతులు పొందాలని బత్తిలి ఎస్సై యతిరాజుల అమ్మనరావు అన్నారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసినా, ఉత్సవాల పేరుతో హంగామా చేసినా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. రోడ్డుకు అడ్డంగా మండపాలు ఏర్పాటు చేయొద్దని, ఐదు రోజులకు మించి ఉత్సవాలు నిర్వహించరాదని, ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు.

పాలకొండ రూరల్: వినాయ క చవితి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటన లు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవాల ని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను శనివారం పరిశీలించారు. మండపాల ఏర్పాటుకు ఉత్సవ కమి టీ సభ్యులు ముందు స్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.